క్లుప్తంగా

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తా


ఎస్సై పవన్‌కుమార్

ప్రత్తిపాడు: మండలంలో అసాంఘిక కార్యకలాపాలు చోటు లేకుండా చర్యలు చేపడతానని ప్రత్తిపాడు ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ఎం.పవన్ కుమార్ అన్నారు. ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రధానంగా శాంతి భద్రతల పరిరక్షణపై దృష్టి సారిస్తామన్నారు. జిల్లా ఎస్పీ సూచనల మేరకు జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణ, గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణాలను అరికట్టేందుకు పాటుపడతానని ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిళ్లు దగ్ధం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని బురదకోటలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన ముర్ల సత్యవతి, మాడెం కష్ణకుమారిలకు చెందిన తాటాకు ఇంట్లో గురువారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యి మంటలు వ్యాప్తి చెందాయి. ఇళ్లలోని గృహోపకరణాలు అగ్నికి ఆహుతయ్యాయి. ఫలితంగా రూ.2 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. అగ్ని ప్రమాద బాధిత కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు చింతల రాజు, సచివాలయ ఉద్యోగులు పరామర్శించి బియ్యం, నిత్యావసర సరకులు, నగదు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గిట్ల సత్తిబాబు, వార్డు సభ్యులు మాడెం ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు ముర్ల సత్తిబాబు, మడెం బాబ్జీ మాడేం రాంబాబు, మాడెం మాణిక్యం పాల్గొన్నారు.

ముంపు నివారణకు చర్యలు

ఏలేశ్వరం: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ముంపునకు గురైన ప్రాంతాన్ని కప్పేందుకు శుక్రవారం మట్టిని తరలించారు. తిమ్మరాజుచెరువు ప్రధాన పంటకాలువ నుంచి సాగునీరు లీక్ అవ్వడంతో స్థానిక ప్రభుత్వాసుపత్రి ప్రాంగణం ముంపునకు గురైంది. ముంపు నివారణ చర్యల్లో భాగంగా ట్రాక్టర్లతో మట్టిని తరలించారు. ఆసుపత్రిలోని ముంపును కప్పడంతో పాటు పంటకాలువకు ఇరువైపులా మట్టితో గట్లు వేయనున్నారు. ఇటీవల దిగువ ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయగా కాలువకు ఇరువైపులా ఆక్రమణలు పేరుకుపోవడంతో సాగునీరు వృథాగా పోతోంది. దీంతో పాటు కాలువ గట్లు బలహీనపడ్డాయి. కాలువ గట్లపై అక్రమణలు తొలగించాలని రైతులు అనేక సార్లు డిమాండ్ చేశారు. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ నాయకులు తరలించిన మట్టితో ఆసుపత్రి వద్ద కాలువను మెరుగుపరిచి ముంపును పూడ్చనున్నారు.

రత్నగిరి ఈఓకు మాతృవియోగం


ఎన్ గౌరీ కాంతమ్మ (ఫైల్)

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ఈఓగా పనిచేస్తున్న ఎస్వీ సత్యనారాయణ మూర్తికి మాతృవియోగం కలిగింది. ఈఓ మాతృమూర్తి ఎస్.గౌరీకాంతమ్మ (88) శుక్రవారం తెల్లవారుజామున విజయనగరంలోని ఓ ప్రైవేట్ హాస్పటల్‌లో మృతి చెందారు. ఆమె మూడు రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. కాగా శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో వైద్యులు చికిత్స చేసినా ప్రయోజనం లేకపోయిందని దేవస్థానం సిబ్బంది తెలిపారు. విజయనగరంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆమెకు సత్యనారాయణ మూర్తి ఒక్కరే కుమారుడు. కాగా ఈఓ మాతృమూర్తి గౌరీకాంతమ్మ మృతికి పలువురు దేవదాయశాఖ అధికారులు, అన్నవరం దేవస్థానం సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

యువతకు అండగా జైభీమ్ భారత్ పార్టీ

జగ్గంపేట: యువతకు జైభీమ్ భారత్ పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జీ వల్లూరి సత్యానందం అన్నారు. జగ్గంపేటలో శుక్రవారం పార్టీ సమావేశం నిర్వహించారు. 'మన ఓటు-మన పాలన' అనే నినాదంలో జైభీమ్ భారత్ పార్టీని ప్రజల్లోకి తీసుకు వెళుతున్నట్టు సత్యానందం తెలిపారు. జడ శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో జై భీమ్ భారత్ పార్టీ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తోందని తెలిపారు.

గుంతల పూడ్చివేత

తుని: పట్టణంలో కేబుల్ వైర్లు, పైపులైన్ల కోసం తవ్విన గోతులను పూడ్చి వేశామని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు శుక్రవారం తెలిపారు. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు రోడ్డు కటింగ్ గోతుల వలన పడుతున్న ఇబ్బందులను సమావేశం దృష్టికి తెచ్చారు. దీంతో మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి ఆదేశాల మేరకు యుద్ధ ప్రాతిపదికన గోతులను పూడ్చి వేశామన్నారు. మున్సిపాలిటీ ట్రాక్టర్లు మరమ్మతుల్లో ఉన్నందున ప్రజలు చెత్తను రోడ్లపై వేయకుండా పారిశుద్ధ్య కార్మికులకు నేరుగా అందించి సహకరించాలని ఆయన కోరారు.

పదింతల ఫలితాలకు పరితపన

- పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కుల సాధనకు కృషి
- విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ, రోజువారీ పరీక్షలు
- తుని నియోజకవర్గంలో 3780 మంది విద్యార్థులు


తుని మున్సిపల్ హైస్కూల్‌లో అదనపు క్లాసులకు హాజరైన విద్యార్థులు

తుని: త్వరలో ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాల సాధనే ధ్యేయంగా విద్యాశాఖ ప్రత్యేక ప్రణాళికలను రూపొందించింది. ఇప్పటికే 100 రోజుల ప్రణాళిక ద్వారా ప్రత్యేక తరగతుల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు పరీక్షలు రాయడానికి సిద్ధమవుతున్నారు. ఉపాధ్యాయులు సిలబస్‌ను పూర్తి చేశారు. పది పరీక్షలకు నెల రోజుల సమయం ఉండడంతో ప్రత్యేక క్లాసులను నిర్వహించి, రోజువారీ పరీక్షలతో విద్యార్థులను సమాయత్తం చేస్తున్నారు. విద్యాశాఖ అందజేసిన స్టడీ మెటీరియల్‌తో ఉదయం, సాయంత్రం ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులను గ్రేడులుగా విభజించి ప్రత్యేక తర్ఫీదును ఇస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. సెలవు రోజుల్లోనూ అదనపు క్లాసులు, పరీక్షలు నిర్వహించడం ద్వారా వంద శాతం ఫలితాల సాధన కోసం ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు కృషి చేస్తున్నారు.

నియోజకవర్గంలో ఇలా..

తుని నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 3780 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరు కానున్నారు. తుని పట్టణం, తుని రూరల్, తొండంగి, కోటనందూరు మండలాలకు సంబంధించి ప్రభుత్వ పాఠశాలల్లో 2919 మంది, ప్రైవేటు విద్యా సంస్థల్లో 861 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సైతం కార్పొరేట్‌కు దీటుగా ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తున్నారు. నూతన పరీక్ష విధానానికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని మండల విద్యాశాఖాధికారి గీతాదేవి తెలిపారు.

మండలాల వారీగా విద్యార్థుల వివరాలు

మండలం	ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులు	ప్రైవేటు పాఠశాలలు, విద్యార్థులు
తుని టౌన్, తుని రూరల్	1654	656
కోటనందూరు	401	62
తొండంగి	854	-
మొత్తం	2919	861

అదనపు తరగతులతో మంచి ఫలితాలు



అదనపు తరగతులు మంచి ఫలితాలను ఇస్తున్నాయి. ముఖ్యమైన అంశాలను రివిజన్ చేస్తున్నాం. ఏ, బీ గ్రేడుల విద్యార్థులకు ఒక ప్రణాళిక, సీ,డీ గ్రేడుల విద్యార్థులకు మరో ప్రణాళిక రూపొందించి శిక్షణ ఇస్తున్నాం. అన్ని అంశాలపై అవగాహన కల్పిస్తున్నాం. విద్యార్థులు పరీక్షల్లో మానసిక ఒత్తిడికి గురి కాకుండా ధైర్యం కల్పిస్తున్నాం.
– ఎంమైఎస్ విజయ, గణిత ఉపాధ్యాయురాలు, తుని

ప్రతిరోజూ పరీక్షలు



ప్రతిరోజూ ఒక సబ్జెక్టును తీసుకుని విద్యార్థులకు సులభ పద్ధతిలో వివరించి పరీక్షలు నిర్వహిస్తున్నాం. తెలుగు గ్రామర్, కవి పరిచయాలు, రామయణం, వివిధ ప్రక్రియలపై తర్ఫీదు ఇస్తున్నాం. సీ, డీ గ్రేడుల విద్యార్థులకు సులభమైన పద్ధతిలో బోధిస్తున్నాం.
– వీఎస్ దేవి, తెలుగు ఉపాధ్యాయురాలు, తుని

పరీక్షలపై భయం లేదు



మా స్కూల్‌లో ఉపాధ్యాయులు ఇచ్చిన సూచనలతో పరీక్షలు అంటే భయం పోయింది. రెగ్యులర్ క్లాసులతో పాటు అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. కష్టమైన అంశాలను రివిజన్ చేసి ప్రతిరోజూ పరీక్ష పెట్టడంతో లోపాలను సవరించుకున్నాను. ధైర్యంగా పరీక్షలు రాస్తాను.
– ఆర్.పుష్పవల్లిదేవి, విద్యార్థిని, తుని

మంచి మార్కులు వస్తాయి



పది పరీక్షలను సులభంగా రాయడానికి అదనపు క్లాసులు ఉపయోపడ్డాయి. రెగ్యులర్ తరగతులతో పాటు ఉదయం, సాయంత్రం వేళల్లో నిర్వహించే ప్రత్యేక క్లాసులతో సబ్జెక్టుల్లో ఉన్న సందేహాలను నివృత్తి అవుతున్నాయి. రోజుకో సబ్జెక్టును రివిజన్ చేసి పరీక్ష నిర్వహిస్తున్నారు. 25 మార్కులకు 24 మార్కులు వస్తున్నాయి. ఉపాధ్యాయులు అందిస్తున్న సహకారంతో పదిలో మంచి ఫలితాలు సాధిస్తాను.
– అజయ్‌కుమార్, విద్యార్థి, తుని

భూముల రీసర్వేకు శ్రీకారం


కవలపాడులో భూములను రీ సర్వే చేస్తున్న అధికారులు

తుని రూరల్: జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో భాగంగా మండలంలో కవలపాడులో భూముల రీసర్వేకు శుక్రవారం అధికారులు శ్రీకారం చుట్టారు. తహసీల్దార్ బాల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సర్వే అధికారులు మస్తాన్, జ్యానేష్, దేవుడు గ్రౌండ్ కంట్రోలింగ్ పాయింట్ (జీసీపీ)ను గుర్తించారు. మండల వ్యాప్తంగా జీసీపీలను గుర్తించిన తర్వాత డ్రోన్‌తో రీ సర్వే చేపడతామని మండల సర్వేయర్ దేవుడు తెలిపారు. 24 రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వేను నెల రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ కందుల కుసరాజు, వీఆర్వో కె.చంటిబాబు, విలేజ్ సర్వేయర్ అత్తిలి సాయి రామ్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత

ఏలేశ్వరం: పట్టణంలో అగ్ని ప్రమాద బాధితులకు వైఎస్సార్ సీపీ నాయకులు చేయూతనిచ్చారు. స్థానిక చైతన్యనగర్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఎస్.వెంకటలక్ష్మికి చెందిన తాటాకిల్లు దగ్ధమైంది. దీంతో వైఎస్సార్ సీపీ నేత, మున్సిపల్ కౌన్సిలర్ అలమండ చలమయ్య ఆధ్వర్యంలో బాధితురాలికి బియ్యం అందజేశారు. ప్రభుత్వం నుంచి సాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బాధితురాలికి నూతన ఇల్లు మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తొండారపు రాంబాబు, మసిరపు నాగేశ్వరరావు, యండగండి నాగబాబు, కోనాల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించండి

- జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం
- రౌతులపూడిలో మండల సమావేశం


సమావేశంలో ఉద్యానవన అధికారి అరుణ్‌కుమార్‌ను ప్రశ్నిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు చినదివాణం

రౌతులపూడి: మండలంలోని అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ కోడ్ అమల్లో ఉన్నందున ఎలాంటి తీర్మానాలు చేయలేదు. తొలుత మండల వ్యవసాయాధికారి రెడ్డ ఈశ్వరరావు రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందిస్తున్న పథకాలు, రాయితీలను వివరించారు. ఉద్యానవనశాఖ అధికారి అరుణ్‌కుమార్ ఆ శాఖ పనితీరును వివరించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం మాట్లాడుతూ ఉద్యానవనశాఖ అధికారి మండలానికి వచ్చి ఆరునెలలు గడిచిందన్నారు. గ్రామాల్లో ప్రజా ప్రతినిధులకు సమాచారం లేకుండా విధులు నిర్వహించడంపై ప్రశించారు. గ్రామాల్లో పర్యటిస్తున్నప్పుడు స్థానిక ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం శాఖల వారీగా పనితీరుపై సమీక్షించారు. ఏపీఎస్ ఆర్టీసీ, పౌర సరఫరాలు, ఎక్సైజ్ అధికారులు సమావేశానికి హాజరుకాకపోవటంపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఎంపీడీఓ ఎం.గోవింద్ తెలిపారు. వైస్ ఎంపీపీలు ఎస్.సాయి, వాసిరెడ్డి మంగాలక్ష్మి, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

గ్యాస్ ధరల పెంపుపై నిరసన



గోవిందపురంలో గ్యాస్ ధరల పెంపుపై నిరసన తెలుపుతున్న మహిళలు

జగ్గంపేట: కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధరను పెంచి మహిళలకు మహిళా దినోత్సవ కానుక ఇచ్చిందని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు అన్నారు. మండలంలోని గోవిందపురంలో శుక్రవారం ప్రగతి శీల మహిళా సంఘం ఆధ్వర్యంలో గ్యాస్ ధర పెంపునకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జునరావు మాట్లాడుతూ దేశ ప్రధానిగా మోదీ రెండోసారి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయన్నారు. దేశంలో మహిళలకు రక్షణ లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. పెంచిన గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా నాయకులు కోరుకొండ మరిడమ్మ, సంకురమ్మ, లిబరేషన్ నాయకుడు జక్కంపూడి రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి తాగునీటి సరఫరాకు అంతరాయం

తుని: స్థానిక కత్రాళ్లకొండ ప్రధాన పంపుహౌస్ నుంచి నీటి సరఫరాకు వినియోగిస్తున్న ఆర్‌సీసీ పైపులైన్ల మరమ్మతుల కారణంగా ఈ నెల 6 నుంచి 10 వరకు పట్టణంలో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతోందని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు శుక్రవారం తెలిపారు. కొండవారిపేట, సినిమా రోడ్డు వరకు పైపులైన్లు వేసి 40 ఏళ్లు దాటడంతో దెబ్బతిన్నాయి. దీంతో తాగునీరు నలుపు రంగు వస్తోంది. ఈ మేరకు పైప్‌లైన్లను శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి ఆదేశించారు. ప్రస్తుతం మరమ్మతు పనులు చేపట్టిన కారణంగా ఈ నెల 6 నుంచి 10 వరకు ఉదయం మాత్రమే కుళాయిల ద్వారా నీటి సరఫరా జరుగుతుందన్నారు. ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని ఆయన కోరారు.

వేసవిలో వచ్చే వ్యాధులపై అవగాహన అవసరం


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ జయవర్ధిని

గోకవరం: గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలందించే పీఎంపీలు వైసవిలో వచ్చే వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని రాజమహేంద్రవరం ఎక్స్‌పర్ట్ ఆస్పత్రి డాక్టర్ వి.జయవర్ధిని అన్నారు. మండలంలోని బావాజీపేట శివారున అష్టలక్ష్మి ఆలయ సమీపంలో శుక్రవారం గోకవరం, ఏజెన్సీ మండలాల్లో సేవలందిస్తున్న పీఎంపీలకు మండల పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు పి.చిన్ని ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జయవర్ధిని మాట్లాడుతూ వేసవిలో వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వేసవిలో వచ్చే పలు వ్యాధులు, ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించారు. పీఎంపీలు సంఘం నియమ నిబంధనలకు లోబడి వైద్య సేవలందించాని పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి ఏబీటీ రాజు సూచించారు. జిల్లా కార్యదర్శి బళ్లా శ్రీనివాస్‌రావు, డాక్టర్ బి.రవికుమార్, డాక్టర్ సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

శంఖవరం: మండలంలోని వాద్రేవు వెంకటాపురంలో సీతారామాంజనేయస్వామి ఆలయ, ధ్వజస్తంభ నిర్మాణాలకు ఎంపీపీ పర్వత రాజబాబు శుక్రవారం శంకుస్థాపన చేశారు. వేదపండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ ప్రజలు ఆలయ నిర్మాణానికి సహకరించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించిన వారిపై చర్యలు

శంఖవరం: తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి పాస్ పుస్తకాలు పొందాలని చూసిన వానిపై చర్యలు తీసుకోవాలని స్థానిక మండల సర్వేయర్ రాజశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని అన్నవరం గ్రామానికి చెందిన యాదల రమణ గ్రామంలో తనకున్న భూమికి సర్వే చేయాలని గతేడాది నవంబర్ 9న గ్రామ సచివాలయంలో దరఖాస్తు(ఎఫ్ లైన్) చేశాడు. అదే రోజున సర్వే చేసేందుకు అధికారులు అర్జీదారుకు పలు మార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. దీంతో అర్జీదారు దరఖాస్తు చేసిన సర్వే నంబర్‌లో పీడబ్ల్యూడీ కాలువ నమోదై ఉన్నట్లు గుర్తించి అధికారులు ఆ దరఖాస్తును తిరస్కరించారు. అన్నవరంలో గల పీడబ్ల్యూడీ కాలువకు గాని, యాదల రమణ సర్వేకు దరఖాస్తు చేసిన భూమికి ఎటువంటి హక్కు పత్రాలు లేవన్నారు. తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించిన అర్జీదారుపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని అన్నవరం పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేసినట్టు రాజశేఖర్ తెలిపారు.

నాడు-నేడు పనుల పరిశీలన


గోకవరంలో నాడు-నేడు పనులు పరిశీలిస్తున్న ప్రవీణ్ ప్రకాష్

గోకవరం: గోకవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ శుక్రవారం రాత్రి పరిశీలించారు. రాత్రి పదిన్నరకు వచ్చిన ఆయన సుమారు గంట పాటు కళాశాలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. మరుగుదొడ్లు, తరగతి గదులను పరిశీలించారు. రూ.20 లక్షలతో చేపట్టిన పనులపై కళాశాల అధికారులతో పాటు ఇంజినీరింగ్ అధికారులను ఏయే పనులకు ఎంత ఖర్చు చేశారని పశ్నించగా వారు తడబడటంతో మండిపడ్డారు. అనంతరం కళాశాలలో ఉత్తీర్ణత శాతం, పరీక్షల ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్జేడీ నాగమణి, డీఈఓ ఎస్.అబ్రహం, ఎంఈఓ బి.గౌరమ్మ తదితరులు ఉన్నారు.

చెట్ల ఫలసాయానికి నేడు బహిరంగ వేలం

తుని: స్థానిక ఆర్టీసీ డిపోలోని మామిడి, సపోటా చెట్ల ఫల సాయానికి శనివారం సాయంత్రం 3 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ టి.కిరణ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిపో ఆవరణలో ఉన్న 60 మామిడి, 4 సపోటా చెట్ల ఫల సాయం ఏడాది పాటు పొందేందుకు ఈ వేలం నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి కలిగిన వారు రూ.1000 డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు. పాట ఖరారు కాకపోతే తిరిగి డిపాజిట్ చెల్లిస్తామన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

కిర్లంపూడి: మండలంలోని బూరుగుపూడిలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను శుక్రవారం ఏపీఓ బి.చిరంజీవిరావు పరిశీలించారు. ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. ప్రతిఒక్కరూ తమ జాబ్ కార్డును ఆధార్‌తో అనుసంధానం చేయించుకోవాలన్నారు. ఉపాధి పనులను పారదర్శకంగా నిర్వహించాలని ఫీల్డ్ అసిస్టెంట్ పాతంశెట్టి వీరబాబును ఆదేశించారు. పలువురు ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

జీడిమామిడి తోటల దగ్ధం

ప్రత్తిపాడు: మండలంలోని బవ్వరువాక పంచాయతీ శివారు తాడువాయి గిరిజన తండాలో జీడిమామిడి తోటలు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో ఇజ్జల భగవాన్ దాసు, జమిత రాంబాబు, లాలం లోవరాజు, జమ్మిలి గోపాలకృష్ణ, బల్లుల పట్టాలమ్మ, లవుడు నూకరాజు, చాగంటి రాజమ్మలకు చెందిన 12 ఎకరాల్లో జీడీ మామిడి తోటలు కాలిపోయాయి. పూత సైతం కాలిపోయి మాడిపోవడంతో భారీ ఎత్తున నష్టం వాటిల్లిందని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ప్రాంతంలో సెల్ నెట్‌వర్క్ లేకపోవడంతో అగ్ని మాపక కేంద్రానికి సమాచారం అందించలేకపోయామని చెప్పారు.

బాలికల చదువుతో సమాజానికి మేలు

గోకవరం: బాలికలు చదువుకోవడం ద్వారా సమాజానికి మేలు జరుగుతుందని కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రి సీహెచ్ఓ మేరీకృప, ఎంపీహెచ్ఈఓ వైఎస్ రాయుడు, హెల్త్ ఎడ్యుకేటర్ శైలజ అన్నారు. గోకవరం జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం బేటీ బచావో బేటీ పడావో నిర్వహించారు. ఆడపిల్లలను చదివిద్దాం, ఆడపిల్లలను కాపాడుకుందాం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

వేంకటేశ్వరస్వామికి దర్శించిన ఎమ్మెల్యే


స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు, ప్రజాప్రతినిధులు

గండేపల్లి: ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, వేణు దంపతులు శుక్రవారం తాళ్లూరు జీయన్న మఠంలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం పండితులు ఆశీస్సులు అందజేశారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైస్ ఎంపీపీ కుంచే రాజా, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కందుల చిట్టిబాబు, మురారి ఉప సర్పంచ్ జాస్తి వసంత్, కాకినాడ జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులు ఒబిణ్ని వీరబాబు, ఉప్పలపాడు సర్పంచ్ అడబాల ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

వైభవంగా గ్రామోత్సవం

స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం హంస, అశ్వ, గరుడ, శేష వాహనాలపై స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

శరవేగంగా తుని-కవలపాడు రోడ్డు పనులు


తుని-కవలపాడు రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ సత్య నాగేశ్వరరావు, లక్ష్మణ్

తుని రూరల్: తుని నుంచి ఎస్.అన్నవరం శివారు కవలపాడు గ్రామానికి నిర్మిస్తున్న రహదారి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వైస్ ఎంపీపీ బోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, తుని ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పోతుల లక్ష్మణ్ శుక్రవారం పంచాయతీ రాజ్ డీఈ శివాజీరావుతో కలసి పనులను పరిశీలించారు. ఆర్అండ్‌బీ నిధులు రూ.59 లక్షలతో 1250 మీటర్ల మేర సిమెంట్ రోడ్డు నిర్మిస్తున్నట్టు వైస్ ఎంపీపీ తెలిపారు. ఈ పనులు పూర్తయితే కాకినాడ జిల్లా తుని నుంచి కవలపాడు మీదగా అనకాపల్లి జిల్లా పాల్తేరు, ఈదటం తదితర గ్రామాలకు సులభంగా వెళ్లవచ్చన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు వంగలపూడి వాసు, మురళీకృష్ణ, సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం


రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి చండీహోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు హనుమంతువజ్ఝల అవధాని, ముష్టి పురుషోత్తం, చిట్టిం వాసు, నగేష్, చల్లపల్లి ప్రసాద్ తదితరులు హోమం జరిపారు. స్థానిక ఆర్యవైశ్యసత్రం అధ్యక్షుడు పేరూరి గాంధీ దంపతులు, వైఎస్సార్ సీపీ నాయకుడు వీర్ల సూరిబాబుతో పాటు 25 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు కుంకుమార్చన

సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీసత్యవతీదేవి అమ్మవారికి ఆలయ ప్రధానార్చకుడు కోట శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు లక్ష కుంకుమార్చన నిర్వహించారు కొండ దిగువన తొలిపాంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు ప్రయాగ రాంబాబు ఆధ్వర్యంలో లక్ష కుంకుమార్చన నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

కల్యాణం.. కమనీయం


కిర్లంపూడిలో వేంకటేశ్వరస్వామి కల్యాణం జరిపిస్తున్న పండితులు

కిర్లంపూడి: స్థానిక వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పెంటకోట నాగబాబు, సత్యవేణి దంపతులు పీటలపై కూర్చొని స్వామివారికి కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవం

కిర్లంపూడి: చిల్లంగిలో వేంచేసిన అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం నందీశ్వరుడు, కాలభైరవస్వామి విగ్రహాల పునఃప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. వేద పండితులు స్వామివార్ల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి ప్రతిష్ఠించారు. అనంతరం విశ్వేశరస్వామికి శాంతి కల్యాణం నిర్వహించారు.

ఆలయ వార్షికోత్సవం

స్థానిక వాసవీ కన్యాకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

గోకవరం: వన్యప్రాణుల సంరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఫోక్స్‌పేట రేంజర్ ఎం.కరుణాకర్ కోరారు. ప్రపంచ వన్యప్రాణి సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని సూదికొండ అటవీశాఖ కార్యాలయంలో శుక్రవారం ఆయన సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మానవ చర్యల ద్వారా వన్యప్రాణుల మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. అడవిలో నిప్పు రగిల్చడం ద్వారా వన్యప్రాణులు అంతరించే ప్రమాదం ఉందన్నారు. ప్రతిఒక్కరూ వన్యప్రాణుల సంరక్షణకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు రాజా, భూపాల్, ప్రశాంత్ కుమార్, మనోహర్, శ్రీను, గోవిందు తదితరులు పాల్గొన్నారు.